గ్రాఫ్ పెంచుకోవడానికే తప్పుడు ప్రచారాలు

మాట్లాడుతున్న చిన్నా రెడ్డి

ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నా రెడ్డి

వనపర్తి,ఫిబ్రవరి 26 : వనపర్తిలో ఎమ్మెల్యే గ్రాఫ్ పెంచుకోవడానికి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి విమర్శించారు. ఇటీవల వనపర్తిలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు పర్యటనలో బుద్ధారం శివారులో మార్కెట్‌యార్డు శంకుస్థాపనను అడ్డుకున్న విషయంపై తప్పుడుప్రచారం చేశారన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క తానుఅడ్డుకున్న అంశంపై ఆరా తీశారని, దీనిపై ఎమ్మెల్యేకు మల్లు ఫోన్ చేశారని, అనంతరం చర్య తీసుకుంటామని చెప్పినట్లు ఓ పత్రికలో వార్త ప్రచురణ జరిగిందన్నారు. అయితే, దీనిపై తాను స్వయంగా మల్లుభట్టి విక్రమార్కను కలిసి అడిగానని, తాను వనపర్తి అంశం గురించి తెలుసుకోలేదని, ఎవరికి ఫోన్ చేయలేదని చెప్పారని వివరించారు. ఇలాతప్పుడు సమాచారం ఇచ్చివార్తలు రాయించుకుని గ్రాఫ్ పెంచుకునే ప్రయత్నం తప్పా మరొకటి లేదన్నారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం కల్లా అని, తమ మధ్య విభేదాలు రగిలించే యత్నం బీజేపీ నాయకులు మానుకోవాలని, అభివృద్ధికి ఆటంకం అనడం సరికాదన్నారు.సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌తదితరులు ఉన్నారు.

ఆరేపల్లిలో చలివేంద్రం ఏర్పాటు చేసిన వివేకానందసంఘం సభ్యులు

చలివేంద్రం ఏర్పాటు

అమరచింత, ఫిబ్రవరి 26 : వేసవికాలం ప్రారంభం కాకముందే ఎండలు దంచి కొడుతుండడంతో వేసవిలో ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు స్వామి వివేకానంద సేవా సమితి గ్రామశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఆరేపల్లిలో చలివేంద్రం ఏర్పాటు చేశామని సంఘం సభ్యులు తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామ కూడలిలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, గ్రామపెద్దలు, యువకులు ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

ధరూరు, ఫిబ్రవరి 26 : పొలం దగ్గర వేసుకున్న గడ్డి ప్రమాదవశాత్తు దగ్ధమైన ఘటన మండలంలోని గ్రామంలో చోటు చేసుకున్నది. మండలంలోని బూరెడ్డిపల్లి గ్రామంలో రైతు తిమ్మారెడ్డికి చెందిన పశుగ్రాసం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన స్థానిక రైతులు మంటలను అదుపులోకి తెచ్చినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ.50 వేల నష్టం జరిగినట్లు రైతు తిమ్మారెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వం ఆదుకొని వెంటనే నష్టపరిహారం అందించాలని వాపోయాడు

అస్తవ్యస్తంగా ట్రాఫిక్ నియంత్రణ

- ఇష్టాను సారంగా వాహనాల నిలిపివేత
- రోడ్డుపైకి నిర్వహిస్తున్న వ్యాపారాలు
- రాక పోకలకు ఇబ్బం దులు పడుతున్న ప్రజలు
- పట్టిం చుకోని ట్రాఫిక్ పోలీస్

అమరుల స్తూపం ఎదుట ఇష్టానుసారంగా వాహనాల నిలిపివేత

రథశాల ముందు రోడ్డుపై నిర్వహిస్తున్న వ్యాపారాలు

గద్వాలటౌన్, ఫిబ్రవరి 26: పట్టణం రోజురోజు విస్తరిస్తుంది. జిల్లా కేంద్రం కావడంతో ప్రజల రాకపోకలు పెరిగాయి. అందుకు తగ్గట్లు వాహనాలసంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ప్రతిరోజూ జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలతో, వాహనాలతో పట్టణం కిక్కిరిసిపోతుంది. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను నిలిపివేస్తున్నారు. దానికితోడు ప్యాసింజర్ వాహనాల యజమానులు సైతం వారి వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేసి వెళ్లి పోతుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

ఇష్టానుసారంగా వ్యాపారాలు...

పట్టణంలో ప్రతి కూడలివద్ద నిర్వహిస్తున్న తోపుడు బండ్ల వ్యాపారస్తులు ఓ క్రమంలో వ్యాపారాలను నిర్వహించడం పూర్తిగా మరిచిపోయారని చెప్పక తప్పదు. తమకు ఇష్టమొచ్చిన చోట టెంట్ పాతేస్తున్నారు. అలాగే తోపుడుబండ్లను సైతం రోడ్డుకు అడ్డంగాపెట్టి వ్యాపారాలు జరుపుకొంటున్నారు. దీంతో కొనుగోలుదారులు రోడ్లపై వారి వాహనాలను ఆపి కొనుగోలు చేస్తున్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

కొరవడిన ట్రాఫిక్ నియంత్రణ...

పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. నియంత్రణ చర్యలు తీసుకోవాల్సిన ట్రాఫిక్ విభాగం మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపార సంస్థలు, వాహనాల నిలుపుదలపై దృష్టిసారించడం మానేశారు. ట్రాఫిక్ సిగ్నల్‌కు అడ్డుగా ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న పట్టించుకోవడం లేదు. రోడ్డుపై ఉన్న వాహనాల ఫొటో తీసి ఫైన్ వేయడం తప్పా ట్రాఫిక్ పోలీసులు చేసేది ఏమి లేదన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

మంత్రులు, పేరున్న నాయకుల కార్యక్రమాలు జరిగితేనే ట్రాఫిక్ నియంత్రణపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారిస్తారని, సామాన్య ప్రజల ఇబ్బందులు పట్టవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని కోరుతున్నారు.

ముగిసిన ఎస్ఎఫ్ఐ జిల్లా రెండో మహాసభలు

ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన బి.మల్లేశ్, ఎం.ఆది

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 26 : జిల్లా కేంద్రంలోని ఎంవైఎస్ ఫంక్షన్‌హాలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా రెండో మహాసభలు బుధవారంతో ముగిశాయి. ఈ మహాసభలో 8 తీర్మానాలు చేసినట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఆది తెలిపారు. అదేవిధంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేశ్, జిల్లా కార్యదర్శిగా ఎం. ఆది, ఉపాధ్యక్షుడిగా రాఘవ, సహాయ కార్యదర్శిగా రామకృష్ణ, కమిటీ సభ్యులుగా ఆంజనేయులు, వీరన్ననాయక్, మోహన్, రాజవర్ధన్, మల్లీశ్వరి, రమేశ్, కార్తీక్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. నిరంతరం పేదవి ద్యార్థుల పక్షాన ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులను ఐక్యం చేసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు కొనసాగిస్తూ జిల్లాలో బలమైన విద్యార్థి సంఘంగా విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. మహాసభలో 8 తీర్మానాలు చేశామని అందులో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, పెంచిన మెస్ చార్జీలను అమలు చేయాలని, యూజీసీ గైడ్‌లైన్స్ ముసాయిదా నిర్ణయం వెనక్కి తీసుకోవాలన్నారు. మహిళలకు, అమ్మాయిలకు రక్షణ చట్టాలు అమలు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జిల్లాలో అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలన్నారు. అదేవిధంగా జిల్లాలో ఖాళీగా ఉన్న లెక్చరర్లు పోస్టులు, టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, నూతనంగా ఏర్పడ్డ అమరచింత, చిన్నంబావి, రేవల్లి , మదనాపురం మండలాల్లో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నేతలు తదితరులు పాల్గొన్నారు.

గుట్టపై జ్యోతి వెలిగించడం ఆనవాయితీ

ఖిల్లా ఘణపురం, ఫిబ్రవరి 26 : ఖిల్లాఘణపురంలోని విఘ్నేశ్వర గుట్టపై ప్రతిఏడాది మహాశివరాత్రి రోజు జ్యోతిని వెలిగించడం అనవాయితీగా వస్తుందని గ్రామ మాజీ సర్పంచు వెంకటరమణ తెలిపారు. అందులో భాగంగానే ఈ ఏడాది శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని విఘ్నేశ్వర గుట్టపై జ్యోతిని వెలిగించడం జరిగిందని ఆయన చెప్పారు. భక్తులు, యువకులతో కలిసి గ్రామంలోని మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గుట్టపైకి బయల్దేరి వెళ్లి అక్కడ జ్యోతిని వెలిగించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరుపుకొన్నారు.

విఘ్నేశ్వర గుట్టపై జ్యోతిని వెలిగించిన దృశ్యం

ఆత్మకూర్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

అమరచింత, ఫిబ్రవరి 26 : వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఆత్మకూర్ పట్టణంలో చెర్ల పర మేశ్వ స్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడురోజుల పాటు ఉమ్మడిజిల్లాల స్థాయిలో జాతర మైదానంలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామని జాతరకమిటీ అధ్యక్ష కార్యదర్శులు వెంకటవర్సింగరావు, ప్రధాన కార్యదర్శి మనివర్ధన్‌రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా వారు బుధవారం ఆత్మకూర్ ప్రభుత్వ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. మొదటిరోజు సాయంత్రం 5గంటలకు పల్లె జ్యోతితో జాతర ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభం చేసేందుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని, మొదటి బహుమతి రూ.20వేలు, రెండోబహుమతిగా రూ.15వేలు. మూడో బహుమతిగా రూ.10వేలు, నాలుగోబహుమతిగా రూ.5 వేల నగదును అందజేస్తామని తెలిపారు. క్రీడాకారులు తమ పేర్లను 28 ఫిబ్రవరి లోపు నమోదు చేసుకునేందుకు 9494019675, 8499898925 నెంబర్లును సంప్రదించాలని చూచించారు. కార్యక్రమంలో జాతర కమిటీ సలహాదారులు పరమేశ్, రహిమాతుల్లా, సభ్యులు సాయి రాఘవేంద్ర, నాగేశ్, పూజరి కరిబయ్య పాల్గొన్నారు.

అధికారిపై ఫిర్యాదుచేసినా పట్టదా..?

పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 26 : వనపర్తి వైద్య కళాశాల హాస్టల్ అద్దె నిధుల దుర్వినియోగంపై పూర్తి ఆధారాలతో వనపర్తి కలెక్టర్, బీసీ వెల్ఫేర్ కమిషనర్‌పై ప్రభుత్వ కార్యదర్శికి ఫిర్యాదు చేయనున్నట్లు పీడీఎస్‌యూ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. జిల్లా బీసీసంక్షేమ శాఖాధికారి బీరం సుబ్బారెడ్డి అవినీతి అక్రమాలపై రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదుచేసి నెలరోజులు గడుస్తున్న చర్యలు మాత్రం శూన్యమన్నారు. విచారణకు వచ్చినా రాష్ట్ర అధికారి జిల్లా అవినీతి అధికారితో ములాకత్ అయినట్లు ఆరోపించారు. విచారణ రిపోర్టు పెట్టకుండా ఆయనపై చర్యలు తీసుకోక పోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు.

వనపర్తి ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థినుల వసతి కోసం కేటాయించిన అద్దె నిధులను అధికారులు దుర్వినియోగం చేశారన్నారు. రూ. 13లక్షల780 ప్రభుత్వం నిధులు విడుదల చేయగా ఆ నిధులను చట్టరవిరుద్ధంగా వేరే ప్రయోజనాలకు మళ్లించారని ఆరోపించారు. ఈ విషయంపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, నిధులు దుర్వినియోగంపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2016లో జారీచేసిన ఆర్‌సీ నంబర్ బీసీ 1/1134/92, 27-09-2016 ఉత్తర్వులను అధికారులు తప్పుదోవ పట్టించారన్నారు. ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం ఖజానా లేక విలవిల లాడుతుంటే జిల్లాలో ఉండే జిల్లా బీసీ సంక్షేమ అధికారులలాంటి వారు అవినీతి అక్రమాలకు పాల్పడే వారు కళకళలాడుతున్నారని పవన్‌కుమార్ అన్నారు.

ఆధారాలతో సహా రాష్ట్రకమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే కమీషనర్‌గాని, కలెక్టర్ సస్పెండ్ చేయకుండా ఆయనను కాపాడుతున్నారని ఆరోపించారు. వెంటనేచర్యలు తీసుకోక పోతే ప్రభుత్వ కార్యదర్శికి ఫిర్యాదు చేయడం తోపాటు కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో కార్యదర్శి సాయికృష్ణ, రాకేశ్, ప్రవీణ్, బీచుపల్లి, రవీందర్, వేణుగోపాల్ రాజారెడ్డి, చరణ్‌తేజ, గణేశ్, శ్రీనివాస్‌తో సంఘం నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవా

శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

కొత్తకోట : పామాపురంలో పూజలు చేస్తున్న భక్తులు

అలంపూర్, ఫిబ్రవరి 26 : మహాశివరాత్రి సందర్భంగా అలంపూరు క్షేత్రం భక్తకోటితో పులకించిపోయింది. ఉదయం నుంచి రాత్రివరకు భక్తులతో కిటకిటలాడాయి. బాలబ్రహ్మేశ్వర ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు దంపతులు, మాజీ ఎమ్మెల్సీ వావిలాల సునీత ఆలయాలను దర్శించుకున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

రాజోళి, ఫిబ్రవరి 26 : శివనామ స్మరణతో మారుమోగాయి. శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం కనులపండుగగా నిర్వహించారు.

ధరూర్‌లో..

ధరూరు, ఫిబ్రవరి 26 : మహాశివరాత్రిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పారుచర్లలో శివపార్వతుల కల్యాణ మాజీజెడ్పీ చైర్‌పర్సన్ సరిత పూజలు చేశారు.

మల్దకల్‌లో..

మల్దకల్, ఫిబ్రవరి 26 : మండలంలోని శివరాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదిశిలా క్షేత్రం, మల్లెంపల్లి, బిజ్వారంలో అమరవాయి, పాల్వాయి అడవి శివాంజనేయ స్వామి, కుర్తిరావులు చెట్టులో పూజలు చేశారు.

గట్టులో..

గట్టు, ఫిబ్రవరి 26 : మండలంలోని వీరభద్రస్వామి, బస్టాండులోని శివాలయం, మాచర్లలోని చెన్నకేశవస్వామి ఆలయాలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. గట్టుకు చెందిన శివ సాయిప్రసాద్, ఉదయ్‌కుమార్ వీరభద్రుడికి వెండి ముఖకవచాన్ని వితరణ చేశారు.

వనపర్తి జిల్లాలో..

పాన్‌గల్, ఫిబ్రవరి 26 : మండలంలోని తెల్లర్లాపల్లి, రేమద్దుల, బుసిరెడ్డిపల్లి తదితర శివాలయాల్లో భక్తులు చేరుకొని పూజలు చేశారు. రేమద్దులో వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

అమరచింతలో..

అమరచింత, ఫిబ్రవరి 26 ఆత్మకూర్, అమరచింత మండలాల్లోని భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి నిర్వహించారు. నందిమల్ల, చంద్రఘడ్ రామాలింగేశ్వర స్వామి, కనకపర మేశ్వర స్వామి, చెర్లపర మేశ్వరస్వామి, కత్తెపల్లి శివాలయం, సింగపేట ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు మహాశివరాత్రిని నిర్వహించారు.

పెబ్బేరులో..

పెబ్బేరు, ఫిబ్రవరి 26 : మహాశివరాత్రిని భక్తిశ్రద్ధల తో నిర్వహించారు. ఆలయాల్లో మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలను దర్శించుకున్నారు.

గోపాల్‌పేటలో..

గోపాలపేట, ఫిబ్రవరి 26 : మండలంలోని గోపాల్‌పేట, ఏదుల శివరాత్రిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుద్ధారం రామలింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు.

పెద్దమందడిలో...

పెద్దమందడి, ఫిబ్రవరి 26 : మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో శివ నామస్మరణతో మార్మోగింది. ఆలయాల్లో శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి

మదనాపురం, ఫిబ్రవరి 26 : మండలంలోని ఆయా గ్రామాలలో మహాశివరాత్రి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.

బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎస్పీ దంపతులు

ప్రమాదకరంగా డ్రైనేజీ గుంత

- **మొద్దు నిద్రలో మున్సిపల్ అధికారులు**

కొత్తకోట పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ

కొత్త కోట, ఫిబ్రవరి 26 : కొత్త కోట మున్సిపాలిటీ పూర్తి స్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ అతలాకుతలంగా మారింది. మున్సిపల్ అధికారులు మొద్దునిద్ర, వైఫల్యాలు కళ్లకు కట్టినట్లు కన్పిస్తున్నాయి. పట్టణంలోని వనపర్తి రహదారిలో రాహుల్ దవాఖాన సమీపాన ఉన్న డ్రైనేజీ ప్రమాదకరంగా మారింది. దీనిపై ఎలాంటి సీసీ దిమ్మలు గాని, చుట్టూ కంచెను గాని ఏర్పాటు చేయక పోవడం వలన అటు వైపు వెళ్లే వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాక ప్రభుత్వ పాఠశాల, ప్రైవేట్ పాఠశాలలు ఎక్కువగా ఈ దారి గుండా ఎక్కువగా ఉండడం వలన విద్యార్థులు, చిన్నపిల్లలు అందులో పడి గాయాల పాలైన వారు ఉన్నారు. అంతేకాకుండా డ్రైనేజీ గుంత ప్రక్కనే బుక్‌స్టాల్ ఉండడం వలన పిల్లలు ఎక్కువగా తిరుగుతూ పొరపాటున డ్రైనేజీలో పడి ప్రాణాలపై ముప్పు తెచ్చుకుంటున్నారు. ఇటీవల పట్టణానికి చెందిన శివ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఈ డ్రైనేజీలో పడి ప్రమాదానికి గురయ్యాడు. అంతేకాక మూగజీవాలు సైతం ఈ డ్రైనేజీలో పడిపోతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మొద్దునిద్రను వీడి ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ చుట్టు తాత్కాలికంగా కంచె ఏర్పాటు చేసి, శాశ్వత పరిష్కారం కల్పించేలా చూడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఆలయంలోకి ఆకతాయి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 26: మండలంలోని కొల్లూరు భవానీమాత ఆలయంలోకి మంగళవారం రాత్రి ఒక ఆకతాయి(అన్యమత స్థుడు) ప్రవేశించి చిల్లర పనులు చేయడంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలలోకి వెళ్తే.. రాజాపూర్ మండలం తిర్మలాపూర్‌కు చెందిన ఒక యువకుడు మంగళవారం రాత్రి కొల్లూరులోని భవానీమాత ఆలయంలోకి ప్రవేశించి..అమ్మవారి విగ్రహంపై ఉన్న చీరలు, గాజులు, పుస్తె తదితర వస్తువులను తొలగించాడు. గమనించిన గ్రామ యువకులు, గ్రామస్థులు అక్కడికి వెళ్లి యువకుడికి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న సీఐ గాంధీనాయక్, ఎస్సై విక్రమ్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో గ్రామస్తులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు.

తాము పవిత్రంగా భావించే అమ్మవారి ఆలయంలోకి ఆకతాయి వెళ్లి..అమ్మవారి గుడిని అపవిత్రం చేశాడుటూ ఆందోళనకు దిగారు. సీఐ గాంధీనాయక్ రంగంలోకి దిగి.. అదేరోజు రాత్రి ఆలయంలో గ్రామ పెద్దలతో పూజలు చేయించి అమ్మవారికి నూతనంగా చీరలు, ఇతర వస్తువులతో ముస్తాబు చేయించారు. ఈ విషయమై సీఐని వివరణ కోరగా.. ఆలయంలోకి వెళ్లి చిల్లర పనులు చేసిన యువకుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట పడేనా..?

- ***చర్యలు తీసుకోవడంలో అధికారుల జంకు***
- ***కోట్లఆస్తులు కూడగట్టుకుంటున్న అక్రమార్కులు***

34 వ వార్డులో పదిశాతం స్థలంలో చేపడుతున్న నిర్మాణ

గద్వాలటౌన్, ఫిబ్రవరి 26 : రోడ్డు ఆక్రమించారా లేక..రోడ్డుపై నిర్మాణాలు చేపట్టరా..ఖాళీ స్థలాల్లోనే కదా నిర్మాణాలు చేపడుతున్నారు...వాళ్లు మనవాళ్లే చూసీచూడనట్లు పోవాలే..అధికంచేస్తే ఉట్టిగుండేది లేదు.. అంటూ రాజకీయ నాయకులు అధికారులపై బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.. దీంతో అక్రమ నిర్మాణాలపై.. అక్రమంగా వెలసిన డబ్బాలపై చర్యలు తీసుకునేందుకు అధికారులు జంకుతున్నారు.. వెరసిరూ.కోట్ల ఆస్తులను అక్రమార్కులు కూడా గట్టుకుంటున్నారు...

పట్టణం మొత్తం ఆక్రమణలు..నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు.. అక్రమ కట్టడాలు..అధికారుల అమ్యామ్యాలతో కూరుకు పోయింది. పట్టణంలో ఎక్కడ చూసినా ఆక్రమణలకు అడ్డు అదుపులేకుండా పోతుంది. ఇందుకు గల్లీ లీడర్ల నుంచి..నియోజకవర్గ స్థాయి లీడర్ల వరకు అక్రమార్కులకు వంత పాడటమే కాకుండా కొందరు నాయకులు స్వయాన అక్రమార్కుల అవతారం ఎత్తారు.. ఇంకేముంది కనీసం ఖాళీ స్థలాల్లో నిర్మాణాలు..కూడళ్లల్లో డబ్బాలు వేస్తేస్తున్నారు. కండ్లముందు జరుగుతున్నా అది అక్రమమని తెలిసినా చర్యలు తీసుకోలేనే స్థితిలో అధికారులు ఉన్నారు. అయితే నివారించడంలో పట్టణ ప్రణాళిక విభాగం ముఖ్యమైంది. కానిసంబంధిత అధికారులు అమలు చేస్తున్న ఏ నిబంధనలు అమలుకావడం లేదు. వివిధ వర్గాలనుంచి వస్తున్న ఒత్తిడిలకు అధికారులు తలొగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆగని అక్రమ నిర్మాణాలు..

34వవార్డులో కుంటవీధిలోని స్థలంలో మున్సిపాలిటీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు నిర్మాణం చేపట్టాడు. అయితే ఈ నిర్మాణం పదిశాతం స్థలంలో చేపడుతున్నారని కాలనీవాసులు ఏడాదిన్నర కిందట అప్పటి అదనపుకలెక్టర్ ఆపూర్వచౌహాన్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో ఆయన స్పందించి నిర్మాణ పనులు నిలిపివేశారు. తాజాగా సదరు వ్యక్తి నిర్మాణ పనులు మళ్లీ మొదలుపెట్టాడు. విషయం అధికారుల దృష్టికి రావడంతో పనులను నిలిపివేశారు. రాజకీయ అండతో సదరు వ్యక్తి 15రోజుల కిందట మళ్లీనిర్మాణ పనులు మొదలుపెట్టాడు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం గమనార్హం.

చర్యలు తీసుకోవాలి...

మున్సిపాలిటీ పాలన ప్రత్యేక అధికారుల పాలనలోనైనా గాడిలో పడేనా అన్న అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ ఉన్నా అక్రమ నిర్మాణాలు చేపడుతుండడమే ఇందుకు నిదర్శనం. అక్రమంగా ఏర్పాటు చేసిన చిన్న పాటి డబ్బాలను తొలగించలేని స్థితిలో ఉన్న అధికారులు అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటారా అన్న ప్రశ్నలను ప్రజలు బాహాటంగానే సందిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమణలపై చర్యలు తీసుకుంటారోలేదో చూడాలి.